సంస్కృతిని పాటించాలి

చందానగర్: శ్రీ లక్ష్మీ గణపతి బ్రాహ్మణ సంఘం చందానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఉపాకర్మ కార్యక్రమంను శనివారం సాయి కీర్తి ఎస్టేట్స్ కమ్యూనిటి హాల్‌లో నిర్వహించారు. పది మందికి ఉపనయనంలో భాగంగా యజ్ఞోపవీతధారణను జరిపించారు. వేద పండితులు, ఘనాపాటి హరి సీతారామమూర్తి శాస్త్రబద్ధంగా పూర్తి చేయించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వేద విజ్ఞానాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలకు అందించేందుకు అందురూ కృషి చేయాలని, స్వీయ నియమ నిబంధనలను తప్పకుండా ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్యామలరావు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి శశి భూషణ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



చందానగర్: చాతుర్మాస్య దీక్షలో భాగంగా చందానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారు అధ్యక్షతన ప్రధాన అర్చకులు సాయి నేతృత్వంలో ప్రత్యేక పూజలు, కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నవితరణ చేశారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: సంతోషిమాత జన్మ దినోత్సవంను పురస్కరించుకుని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సంతోష్ మహారాజ్, దత్త మహారాజ్ తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

సరుకులు అందజేత



పిల్లలతో మాట్లాడుతున్న కమాండెంట్ రామకృష్ణ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో 'ఈ' కంపెనీ వార్షిక కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ రాంబాబు చీర్స్ ఫౌండేషన్ అనాథాశ్రమాన్ని శనివారం సందర్శించారు. సరుకులు, పండ్లు, బియ్యం, నూనె అందజేశారు. కార్యక్రమంలో కమాండర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఈ కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట కాలనీలో 6 కోట్ల 36 లక్షల 78 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాలును శనివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్డగుట్ట కాలనీలో అందరికి అందుబాటులో ఉండే విధంగా,అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు. అలాగే భాగ్యనగర్ కాలనీ, అడ్డగుట్ట, ఆదిత్యనగర్, రామ్‌నరేష్ నగర్, భాగ్యనగర్ కాలనీలో సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో శంకుస్థాపన చేశారు.

రైతు బీమా దరఖాస్తులకు 13వ తేదీ ఆఖరు

శంషాబాద్ రూరల్: రైతు బీమా కోసం రైతులు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత తెలిపారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 5 వరకు పట్టాపాసు పుస్తకాలు వచ్చిన వారు, ఇప్పటి వరకు రైతు బీమా చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారంలో వివరాలు పూర్తి చేసి పట్టా పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను సమర్పించాలన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కల్గిన రైతులు మాత్రమే బీమాకు అర్హులని పేర్కొన్నారు.



బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్‌కు రాఖీ కడుతున్న పార్టీ నాయకులు



హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్‌కు రాఖీ కట్టిన ఏబీవీపీ మహిళా ప్రతినిధులు, నాయకులు



నానక్‌రాంగూడలో..

ఘనంగా రక్షాబంధన్

శేరిలింగంపల్లి జోన్‌బృందం: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు.శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, నాయకులకు మహిళా ప్రతినిధులు వారి ఇళ్లకు వెళ్లి రాఖీలు కట్టారు.

కొండాపూర్ బెటాలియన్‌లో ..

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మినిస్టీరియల్ స్టాఫ్, హోంగార్డులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సిబ్బంది కమాండెంట్ ఎం రామకృష్ణకు రాఖీలు కట్టారు. అనంతరం జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బ్రహ్మకుమారీస్ సంస్థ మహిళా ప్రతినిధులు రాఖీలు కట్టారు. అనంతరం



కొండాపూర్‌లో 8వ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణకు రాఖీ కట్టిన మహిళలు

ఆయన వారికి చీరలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

మియాపూర్: బ్రహ్మకుమారీస్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శివప్రసాద్, ఎస్‌ఐలు చంద్రయ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్ రెడ్డి,మాణిక్యం, కృష్ణ, పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.



సీఐ శివప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్



ఎమ్మెల్యే గాంధీకి రాఖీ కడుతున్న కార్పొరేటర్ మంజులారెడ్డి



హెచ్‌సీయూలో సెక్యూరిటీ సిబ్బందికి రాఖీ కడుతున్న ఏబీవీపీ మహిళా ప్రతినిధులు



మసీదుబండలో.. మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్‌కు రాఖీలు కట్టి హారతి ఇస్తున్న సోదరీమణులు

హర్ ఘర్ తిరంగాతో దేశ ఐక్యతను చాటుదాం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ 'హర్ ఘర్ తిరంగా' వర్క్‌షాప్‌ను శనివారం సాగర్ సొసైటీలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు మెచినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా యువమోర్చా ఆధ్వర్యంలో ఆదివారం (నేడు) తిరంగా ర్యాలీ నిర్వహించాలని, అలాగే మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వతంత్ర సమరయోధులు, మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించాలని, 13, 14 తేదీల్లో ఇంటి పైన జాతీయ పతాకం ఎగురవేసి భారతదేశ ఐక్యతను చాటాలని ఆయన వివరించారు. బీజేపీ ఖైరతాబాద్ నియోకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, నాయకులు శీతల అనిల్‌కుమార్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, చెలిమిటి గిరి, గురుబ్రహ్మగౌడ్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓపెన్ జిమ్

రామచమచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌లో వ్యాయామం చేసేవారు. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఓపెన్ జిమ్‌లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన జిమ్ పరికరాలు

కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ అభినందించారు. అనంతరం తారానగర్‌లోని తుల్జాభవాని ఆలయం, హుడా ట్రేడ్ సెంటర్‌లోని రామాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అనిరుద్ యాదవ్, అభిషేక్ యాదవ్, రవీందర్‌గౌడ్, అఫ్రాన్ సయ్యద్ నయీమ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: కళాకారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కృతి నృత్య అకాడమీ డాక్టర్ రోజని వల్లభనేని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, పుష్పాంజలి, చంద్రచూడ, చరణములే నమ్మితి, ఆత్మరామ, బృందావసానం, కళ్యాణరామ, శివతాండవం, రామాయణశబ్దం, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను కళాకారులు కంతి, అను, వేదం, అక్షద, రజ్వీ, సుకన్య, ఆద్య, రితిక, మహశ్రీ, ప్రదర్శించారు. అలాగే శ్రీరామ నాటక నికేతన్ గురువు మంజుల రామస్వామి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. వసుదైక కుటుంబం, శివస్తోత్రం, నటనమాడినారు, గోపిక మాధవం తదితర అంశాలను కళాకారులు వరేణ్య, స్మితిక, వర్షిక, సాన్విత, అనుష్క, ఆకృతి, వర్ష, రెబెక్క, వంశిక, శరణ్య, సహస్ర, సంధ్య, తనుశ్రీ తదితరులు ప్రదర్శించారు.



అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం స్వరాలాపన నిర్వహించారు. శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ సంస్థ గురువు ఊటుకూరి శ్రీనివాస్ శిష్యబృందం అంతయునీవే, అన్ని మంత్రములు, షోడశకళానిధికి, ఎక్కడి మనుషజన్మము, వచ్చెను అలమేలు మంగ, కంటి శుక్రవారము, కీర్తనలను సృజన, కవిత, రామలక్ష్మి, ప్రసన్న, మహిమ, కావ్య, నివేదిత, వైష్ణవిలు ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్‌లు కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

మియాపూర్: ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద సేవా సంఘం వృద్ధాశ్రమంలో రామస్వామి ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి చందానగర్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు భార్గవ్, అబ్రహం లింకన్, డాక్టర్ షమీర్‌లతో పాటు సిబ్బంది రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా ఆరోగ్యం విషయంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. 90 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివ రామకృష్ణ, విష్ణు ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు సుందర ప్రసాద్, సమాజ సేవకులు వెంకట్, ఆసుపత్రి ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

శంషాబాద్: పట్టణంలోని సాతంరాయిలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాల (బాయ్స్)లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అనూప్ చందు విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, సూచనలు విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షహనా నజ్నీన్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వరంగల్‌కు చెందిన బి.అఖిల్ అమీర్‌పేట బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు సమీపంలో ఉంటున్నాడు. తాత్కాలికంగా తమ బంధువుల ద్విచక్ర వాహనాన్ని వినియోగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి వాహనాన్ని తాను ఉంటున్న హాస్టల్ ఎదుట పార్క్‌చేశాడు. ఉదయం కనిపించ లేదు. శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఈ నెల 19వ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాసభల్లో ప్రజా సమస్యలు, రాజకీయ సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యాచరణలను రూపొందించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రియాజ్, కౌన్సిల్ సభ్యుడు జె.ఆనంద్‌గౌడ్, మండల సహాక కార్యదర్శులు జె.విజయానంద్ గౌడ్, ఎం.డి.షఫి, ఎర్రబోడు, కార్యదర్శి పాండు, లక్ష్మీగూడ కార్యదర్శి జె.సదానంద గౌడ్, ఆసీఫ్ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

ఉషాముళ్లపూడి రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడు?

100 ఫీట్ల రహదారి కోసం ఇళ్ల, వాణిజ్య సముదాయాలకు నోటీసులు

- ముందుకు సాగని పనులు
- రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు





రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

ఆల్విన్‌కాలనీ: ప్రజా ప్రతినిధుల హామీలు అలాగే మిగిలిపోతున్నాయి. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసినప్పుడే వీరు స్పందిస్తారేమోనంటూ స్థానికులు మండిపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ భాగ్యనగర్ కాలనీ నుంచి ఎల్లమ్మబండ మీదుగా గాజుల రామారం, ఉషాముళ్లపూడికి వెళ్లే రహదారిని 100 ఫీట్ల రహదారిగా విస్తరింపచేస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా రహదారికి రోడ్డు మధ్యలో ఉన్న ఇళ్ల, వాణిజ్య సముదాయాలకు నోటీసులు ఇచ్చారు. తదనంతరం ప్రభుత్వం మారినా ప్రజా ప్రతినిధులు వారే ఉన్నా సమస్యలు మాత్రం తీరటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో రోడ్డును విస్తరించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా మమ అనిపించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సరిగ్గా కనిపించక పోవటంతో విద్యుత్ స్తంభాలను ద్విచక్ర వాహనదారులు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం. భారీ వర్షం కురిస్తే రోడ్లన్నీ జలమయమై ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్డు మొత్తం చెరువును తలపిస్తోంది. గోవింద్ హోటల్ చౌరస్తాలో పలుమార్లు రోడ్డు కుంగిపోవటం, నీరు నిలిచిపోవటం వంటివి నిత్యం జరుగుతుంటాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయకుండా తూతూ మంత్రంగా పనులు చేస్తుండటంతో తిరిగి సమస్య పునరావృతం అవుతున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో డ్రైనేజీ పారింది. పక్కనే ఉన్న జయనగర్ కాలనీలోకి ప్రవేశించాయి. దీంతో జయానగర్ వాసులు పలు ఇబ్బందులు పడ్డారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో స్ట్రీట్‌లైట్లు వెలగకపోవటంతో రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటోంది. దొంగల బెడద అధికంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి అయిన ఉషాముళ్లపూడి రోడ్డును త్వరగా విస్తరించాలని, విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపి రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.





ఇటీవల కురిసిన భారీ వర్షానికి చెరువును తలపిస్తున్న రోడ్డు

రోడ్డు మురుగుమయం



స్నేహపురి కాలనీలో..

మోతీనగర్: కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లడంతో రోడ్డంతా బురదమయంగా తయారైంది. మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీ మోతీనగర్ నుంచి బోరబండకు వెళ్లే ప్రధాన రోడ్డు విజేత థియేటర్ సమీపంలో హోటల్ నుంచి తినుబండారాల వ్యర్థాలు, మిగిలిన ఆహార పదార్థాలను డ్రైనేజీలోకి వేయటం వల్ల డ్రైనేజీ పొంగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్‌కు ప్రత్యేక డ్రైనేజీ లేకపోవడంతో పక్కనే ఉన్న ఇంటి యజమాని డ్రైనేజీలోకి వేయటంతో అది నిండి దుర్గంధం వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేయాలని, హోటల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.